

# వేదగిరి రాంబాబు

# వయసుకి కళ్ళెం

రకరకాల వాహనాలతోను, మనుషులతోను కోఠీ సెంటర్ గజిబిజిగా వుంది. అక్కడ నడుస్తున్న శంకర్ మనసు అంతకన్నా గజిబిజిగా వుంది.

మూడు సంవత్సరాలలోనే ఎంత మార్పు!

అప్పుడు ఈ బజార్లన్నీ తెగతిరిగేవాడు, ఇప్పుడూ తిరుగుతున్నాడు. అప్పటికి, ఇప్పటికి ఎంత తేడా! ఆశ్చర్యం వేసింది శంకర్‌కి.

ఆరోజుల్లో తన వెంట ఎప్పుడూ నలుగురయినా వుండేవారు. అందరూ కలిసి ఆనందంగా కబుర్లు చెప్పుకుంటూ, కనిపించిన అమ్మాయినల్లా అల్లరి చేస్తూ తిరిగేవారు. బాధ్యతలేని, తెలీని వయసది!

మరిప్పుడో?

కాలేజి వదిలేసి రెండు సంవత్సరాలు దాటినా వుద్యోగం సంపాదించుకోలేని అసమర్ధుడని ముద్ర పడిపోయింది తనమీద. ఎన్ని ఉద్యోగాలకి అప్లికేషన్లు పెట్టాడో, ఎన్ని ఇంటర్వ్యూలకి వెళ్ళాడో లెక్కలేదు. తన మీద తనకే నమ్మకం లేకుండా పోతోంది. ఇక మిగతా వాళ్ళని ఎలా నమ్మించగలడు, తనకి వుద్యోగం వస్తుందని! మనసు నిండా అశాంతి... నమ్ముకున్న వాళ్ళకీ అశాంతి...!

చదువయిపోయిన తర్వాత కూడా ఇంటర్వ్యూల సాకుతో ఇలా హైదరాబాద్ రావడం, ఆ ఇంటర్వ్యూ కాస్తా అయిందనిపించడం, ఇలా కాసేపు రోడ్ల వెంట తిరిగి రాత్రి బండిలో తిరిగి తన వూరు వెళ్ళి పోవడం మామూలై పోయింది. పాత స్నేహితుల్ని ఎవర్నీ కూడా కలవాలని పించలేదు. వాళ్ళలో చాలామంది ఉద్యోగస్థులై పోయారు.... ఎవర్ని చూసినా ఇదివరకటిలా హాయిగా మాట్లాడలేక పోతున్నాడు... అందుకే ఇలా తప్పించుకు తిరగడం....!

"శంకర్ గారూ..." తన పేరు చెవులని తాకడంతో ఆలోచనల్లోంచి బయట పడ్డాడు శంకర్.

చుట్టూ చూశాడు.

రోడ్డుకి అవతల కొంత మంది స్నేహితురాళ్ళతో మాట్లాడుతూ నిలుచున్న రాధ కనిపించింది. తన వేపే నవ్వుతూ చూస్తోంది. ఆమే పిలిచినట్లుంది...

తనతో వున్న వాళ్ళకి ఏదో చెప్పి గబగబా వస్తోంది. గుండెలు జారి పోయాయి శంకర్‌కి.

ఎవరికైతే ముఖ్యంగా తను కనిపించ కూడదనుకుంటున్నాడో వాళ్ళే కనిపించారు....!

"మీరూ ఇక్కడే వుంటున్నారా?" నవ్వుతూ దగ్గరికి వచ్చింది.

"లేదండీ... ఈ రోజే వచ్చాను ఇక్కడికి..." తడబడ్డాడు శంకర్.

"భలే వాళ్ళే! ఆడవాళ్ళతో మాట్లాడడమే భయమన్నట్లు అలా వణికి పోతారేం! పదండి... అలా కామత్‌కి వెళ్ళి కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం"

శంకర్ గొంతుకి పచ్చి వెలక్కాయ అడ్డం పడ్డట్లయింది.

"అర్జంటు పని మీద వెళ్తున్నానండీ... మళ్ళీ రాత్రి బండిలో మావూరు వెళ్ళి పోవాలి..."

"ఏమిటండి తెగ మొహమాట పడి పోతున్నారు. రెండు సంవత్సరాల తర్వాత కలుసుకున్నాం. కనీసం రెండు నిముషాలయినా మాట్లాడుకోవద్దూ?"

ముందు రాధ——

కొద్దిగా వెనగ్గా శంకర్——

హఠాత్తుగా అతనికి ఆరోజు గుర్తు కొచ్చింది.

ఇదే సెంటర్లో తను తన బృందంతో వెళ్తున్నాడు. కొద్ది దూరంలో ఒంటరిగా వెళ్తున్న రాధ కనిపించింది. అందరిలోనూ కొత్త వుత్సాహం ప్రవేశించింది.

"ఈ సెంటర్‌లో ఆమె తలమీద ముద్దు పెట్టుకుంటే ఎవరికైనా వంద రూపాయలిస్తాను" రాజశేఖరం అన్నాడు.

"ఈ సెంటర్ లోనా! నీ వంద రూపాయలకోసం వళ్ళు హూనం చేసుకునే మూర్ఖుడెవ్వరూ లేరు" వెంటనే బదులిచ్చాడు భద్రం.

"నీతో ఎవరన్నారోయ్.."

"మరి ఎవరితో అన్నావుట..."

"శంకర్‌లాంటి హీరోతో..."

అంతే! తనలో కొత్త వుత్సాహం వురకలు వేసింది. చటుక్కున భద్రం చేతిలోంచి సైకిల్ని లాక్కుని బయల్దేరాడు.

అందరూ విచిత్రంగా చూడసాగారు.

ఎవరూ వూహించని విధంగా తన సైకిల్ ముందుకు దూసుకు పోయింది. రాధ దగ్గరికి రాగానే సైకిల్ని స్లో చేసాడు.

సరిగ్గా పక్కకి రాగానే సైకిల్ మీద వుండే ఆమె తలని దగ్గరకి లాక్కుని చటుక్కున ముద్దు పెట్టుకోవడం, అంతకన్నా వేగంగా ముందుకు దూసుకు పోవడం క్షణాల్లో జరిగి పోయాయ్.

ఆ తర్వాత మరెన్నో సార్లు ఎన్నో విధాలుగా రాధని టీజ్ చేసాడు తను. ఒక్క రాధనే కాదు ఎంతో మంది ఆడపిల్లల్ని ఏడి పించాడు. వాళ్ళందరి వుసురే తగిలి తనకి వుద్యోగం రావడం లేదు! నీరసంగా నిట్టూర్చాడు.

"ఏమిటి మాటా పలుకు లేకుండా మౌనంగా వున్నారు...!" కామత్ హోటల్

**చదువుకునే రోజుల్లో తను చిలిపి తనంతో చేసిన అల్లరి పనులు ఆమె మనసులో ముద్రించుకు పోయాయని, మొదటిసారి పురుష స్పర్శ రుచి చూపించిన తననే ఆమె ఇప్పటికీ కోరుకుంటోందని, అతనికి తెలీదు.!**

మెల్లెక్కుతూ చురుగ్గా చూసింది రాధ.

ఆ చూపుల చలాకీ తనానికి తట్టుల్లోలేక చటుక్కున తల వంచుకున్నాడు శంకర్.

"ఆడపిల్ల కనిపిస్తే చాలు కళ్ళనీళ్ల పర్యంతమయ్యే వరకూ విడిచి పెట్టని తమరు ఇంత బుద్ధి మంతులెప్పుడయ్యారో...?" రాధ వెనకే ఫామిలీ రూమ్‌లోకి నడిచాడు శంకర్.

అతనికి చాలా ఇబ్బందిగా వుంది. కానీ ఆ విషయాన్ని ఆమెకి చెప్పలేదు. చెప్పినా వినిపించుకునే స్థితిలో లేదామె! అందుకే మౌనంగా అనుసరించడం తప్ప మరో గత్యంతరం లేదు.

"మీరు ఎక్కడ పని చేస్తున్నారు...?" ఆమె ఎదురుగా వున్న సీట్లో కూర్చుంటూ అడిగాడతను.

"హమ్మయ్య... ఇప్పటికి నోరు విప్పారన్నమాట! సంవత్సరమైంది. బాంక్‌లో గుమాస్తాగా జేరి..."

సర్వర్ రావడంతో రెండు కాఫీలు తెమ్మంది తనే!

"కాలేజీలో చదువుకుంటున్నప్పటి రోజులే వేరు.... ఎంతో సరదాగా వుండేది... ఆఫీసులో అయితే పాలిటిక్స్ మయం..."

క్రమంగా వాళ్ళ సంభాషణ కాలేజీ రోజుల వేపు మళ్ళింది. అప్పటి తన అల్లరిని ఆమె గుర్తుచేస్తున్న కొద్దీ అతను సిగ్గుతో కుచించుకు పోసాగాడు.

ఆనందంగా ఆమె కబుర్లు చెబుతోంది.

ఇబ్బందిగా అతను వింటున్నాడు.

"మరి బయల్దేరదామా?" ఇబ్బందిగా కదిలాడతను.

"మాఇంటికి వెళ్దామా?" అడిగింది ఆమె. అతనితో ఏమేమో చెప్పాలనే ఆమె ఆరాటాన్ని అతని ప్రవర్తన నీరు కార్చేస్తోంది.



"ఈ సారి వచ్చినప్పుడు తప్పకుండా వస్తాను. ఇప్పుడు కొద్దిగా పనుంది..."

"ప్రామిస్..." చెయ్యి చాపింది ఆమె.

"ప్రామిస్...." ఆమె చేతిలో చెయ్యి వేసాడు.

చిన్నగా నవ్విందామె. సిగ్గుతో తల వంచుకున్నాడతను.

" మా బాంక్‌కి వచ్చారంటే ఇద్దరం కలసి వెళ్ళవచ్చు..."

"అలాగే...."

ఇద్దరూ లేచారు.

బయటకు రాగానే ఆమె దగ్గర శలవు తీసుకుని వెళ్ళిపోయాడతను.

వెళ్తున్న అతని వంకే చూస్తూ నిలబడ్డ రాధ మనసులో రకరకాల ఆలోచనలు...

చదువుకునే రోజుల్లో తను చిలిపి తనంతో చేసిన అల్లరి పనులు ఆమె మనసులో ముద్రించుకు పోయాయని, మొదటి సారి పురుషస్పర్శ రుచి చూపించిన తననే ఆమె ఇప్పటికీ కోరుకుంటోందని, అందుకే అతను కనిపించగానే ఆమె అంత ఆనందంగా ప్రవర్తించిందని అతనికి తెలీదు.

వురకలు వేసే తన వయసు వుత్సాహానికి కళ్ళెం వేసిన తన నిరుద్యోగ పర్వం గురించి ఉద్యోగస్థురాలైన ఆమె ముందు చెప్పలేదు. చెప్తే ఆమెకు తన మీదున్న అభిప్రాయం ఎక్కడ చెడిపోతుందోనని భయం. అదీ కాకుండా ఇప్పటకీ ఆమెకు అపురూపంగా గుర్తున్న అప్పటి అల్లరి చేష్టలు గుర్తుకొస్తే అతనికి చిన్న తనంగాఅనిపించసాగింది. అందుకే ఆమెతో మరికొంత సేపు గడపాలని మనసు వువ్విళ్ళూరుతున్నా వుండలేక అక్కడ నుంచీ వెళ్ళిపోయాడు.

*